# విజన్ 2020

ప్రఫుల్లచంద్ర



కోడిగుడ్డు ముఖంవాడు, రేగుపళ్ల కళ్లవాడు, బొంగరం నోరువాడు వాడే నా మనవడు. పేరు హృతిక్. చదువు పదో క్లాసు.

వాడి తండ్రీ, నా కొడుకూ అయిన వెంకటేశ్వర్లుది కూడా కోడిగుడ్డు ముఖమే గాని కళ్లు చింతాకులు. నోరు అజంతా గుహ! వాడు నోరు తెరవడు. తెరిస్తే మాత్రం అజంతా గుహలోని బొమ్మల్లాగ అక్కడక్కడ దంతాలు కనిపిస్తాయి.

మా కోడలు శ్యామల ముఖం ఇత్తడి సిబ్బి. నోరు పోపుల డబ్బా!

మరి నా సంగతి అంటారా, అది ఎందుకులెండి. రిటైర్ అయినవాడిని. ఈజీ ఛెయిర్‌లో కాళ్లు చాపుకున్నవాడిని! పిలుపు కోసం ఎదురు చూస్తూనే ఇరవయ్యవ శతాబ్దం దాటి ఇరవయ్యొకటవ కిలోమీటర్ రాయి వద్ద తచ్చాడుతున్నవాడిని. ఈనాటి మనుమల లెక్కలోకి రానివాడిని. అంటే ఉత్తి పనికిమాలిన వెధవ అనుకునేరు! ఈనాటి మనుమల లెక్కలోకి రానంటే నా ఉద్దేశం ఈనాటి బడుద్ధాయిలకంటే ఎంతో గ్రేట్ అని.

ఈరోజు తేదీ ఎంత అని అడిగితే నేను ఠక్కున చెప్పగలను. కానీ ఈనాటి బడుద్ధాయులు వాచీ వైపు, లేదా గోడనున్న కాలెండర్‌వైపు చూస్తారు. తిథి, వార, నక్షత్రాలు అడిగితే వెంటనే నేను చెప్పగలను కానీ వీళ్లకు అవేమిటో తెలిస్తే కదా, చెప్పడం!

అంతెందుకు నిన్న మా మనవడిని పధ్నాలుగు పదిహేడులు ఎంతరా అని అడిగితే కాలిక్యులేటర్ టిక్కుటిక్కుమని నొక్కి నాలుగుసార్లు లెక్కకట్టి నాలుగు ఆన్సర్లు చెబితే అన్నీ తప్పే. ఫ్రెండ్‌కి ఫోన్ చేసి అడిగాడు ఎంతని? వాడు చెప్పిన జవాబూ తప్పే. అదే నన్నడగండి. ఇరవై ఇరవైల వరకూ ఏ ఎక్కం అడిగినా చెప్పగలను. ఈనాటి పిల్లలకు ఎక్కాలే తెలియవు.

"చిరంజీవి అసలు పేరు ఏమిటి? శ్రీదేవి ఎప్పుడు పెళ్లి చేసుకుంది?" అడగండి చెబుతాను ... ఈనాటి వాళ్లకి పేరు పూర్తిగా చెప్పడానికే బద్ధకం. మా మనవడు హృతిక్ లేడూ? వాడిని తిక్ అని పిలుస్తారు తిక్కవెధవలు! పేరులోని ఆఖరి అక్షరాలతో మా అబ్బాయిని లూ అనీ, కోడల్ని లా అని పిలుస్తారు. ఇంకా నయం, ఆఘెను మలా అని పిలవడం లేదు! అయినా ఆ పదానికి అర్థం తెలిసేడిస్తే కదా! వీళ్లకి తెలుగు తెలియదు. ఇంగ్లీషు రాదు.

అన్నట్టు నా కొక మనవరాలుందండోయ్! పేరు రీతిక. ముద్దుగా తిక్కా అని పిలుస్తారు. నేను మాత్రం మనవరాలిని తిక్కా వన్ అనీ, మనవడిని తిక్కా టూ అని పిలుస్తా. వాళ్లూ తక్కువ తినలేదు. నన్ను హెచ్‌బీ అని పిలుస్తారు, అంటే హిస్టరీ బుక్ అని! కదిపితే చాలు చరిత్ర తవ్వి కథలు చెబుతానని నా కా పేరు!

ఇంటర్ బోర్డు మీద అపారమైన ప్రేమతో రీతిక నాలుగుసార్లు పరీక్ష ఫీజు కట్టింది. కానీ తను పరీక్ష రాస్తే బోర్డువారికి కాగితాలు ఖర్చు. ప్రశ్నాపత్రాలు ఖర్చు. పేపర్లు దిద్దేవారికి శ్రమ. ఈ వేస్ట్ అంతా ఎందుకని దయతలచి ఆమె పరీక్షలు రాసేది కాదు. అయితే మా అబ్బాయి లూ కి అంత ఔదార్యం లేదు. ఐదోసారి పరీక్ష ఫీజు కట్టడానికి డబ్బు ఇవ్వను పొమ్మన్నాడు.

దానితో అమ్మాయి హృదయం బద్దలైపోయింది. ఔదార్యమే నేరమౌనా అని పాడుతూ కుమిలిపోయింది. టీవీ పెట్టుకుని, దానిలో మ్యూజిక్ పేరుతో వచ్చే కోతి గంతులన్నీ వేస్తూ రోదించింది. కన్నకూతురు క్షోభ చూసి ఆ కన్నతల్లి తల్లడిల్లి, దుఃఖభారం దింపుకు రమ్మని కూతురికి వంద రూపాయలిచ్చింది. అంతే! లేడి కూనలాగా ఛెంగున బయటకు దూకింది తిక్కా వన్. పాపం, ఆ వందా ఖర్చు అయిపోగానే ఆమె మళ్లీ దుఃఖపీడిత అయింది. కానీ ఈసారి ఒక్క రూపాయీ విదపడానికిష్టపడలేదు కోడలు లా. దానితో ఘర్షణ.

తిక్కా వన్ ఇంగ్లీషులో రెచ్చిపోయింది. యూ, నాట్ లవ్స్ మీ! యూ, నాట్ గ్రోస్ మీ రైట్! ఐ లీవ్స్ హోమ్! గోస్ టు ఫ్రెండ్స్ హోమ్!"

ఆంగ్ల భాషకు ఆద్యుడెవరో గాని, ఆయన తిక్కా వన్ కూతలు వింటే గుండె పగిలి వందసార్లు చచ్చేవాడు. ఈనాటి భాషా స్వరూపం తెలిసినవాడిని కాబట్టి ఆ ఘోష అర్థం అయింది నాకు. "నన్ను ప్రేమించడంలేదు, సరిగా పెంచడంలేదు. ఇల్లు వదలి స్నేహితుని ఇంటికి పోతా" అని దాని బెదిరింపు.

ఇంగ్లీషుని తెలుగింగ్లీషుతో ఎదుర్కొంది లా. "గోతే గో! నీ గుడ్డూస్ నా దగ్గర నాట్ బాయిల్స్!" (పోతే పో, నీ గుడ్లు నా దగ్గర ఉడకవు.)


తన గుడ్లు ఉడుకుతాయో, లేదో పరీక్షించుకోడానికే నిర్ణయించుకున్నదానిలా విసురుగా ఒక బాగ్‌లో బట్టలు కుక్కి భుజాన వేసుకుని వెళ్లిపోయింది తిక్కా వన్! లా నిర్ఘాంతపోయింది.

కుటుంబ వ్యవహారాల్లో తల దూర్చితే నా తలమీదున్న రెండు వెంట్రుకలూ ఊడిపోయి నే నొక 'చో' లాగా తయారవుతాను. సారీ, చో ఎవరో మీకు తెలియదు కదూ. ఉన్నాడులెండి ఒక గుండూ మహరాజ్. నేను హిస్టరీ బుక్‌గా మారకముందు ఆయనొక ప్రఖ్యాత జర్నలిస్ట్. అందుకే, ఏ విషయంలోనూ కలుగజేసుకోకుండా, అంతా గమనిస్తూ మనస్సులోనే డైరీ రాసుకసుంటూ నా పెద్దరికాన్ని కాపాడుకుంటున్నా.

సాయంకాలం లూ ఆఫీసునుంచి వచ్చాడు గానీ, తిక్కా వన్ మాత్రం రాలేదు. అమ్మాయంటే తల్లిదండ్రులకు గారం ఎక్కువ. అది పుట్టిన తర్వాతనే మా వాడు రెండు చేతులతోనూ, అవకాశం లభిస్తే రెండుకాళ్లతోనూ బోలెడు సంపాదించి బొజ్జా గుహల్లో గుట్టలు గుట్టలుగా దాచాడు.

ఆ గారం అదనుగా తీసుకుని తిక్కా వన్ బ్లాక్‌మెయిల్ చేస్తూ ఉంటుంది. దాని తిక్కలు చూసి ఒక్కోసారి వాళ్లు తిట్టినా అరగంట గడిచాక అంతా మామూలే. లూ వచ్చాక లా జరిగిందంతా చెప్పింది. ఇంటిలో తనని తాను తిట్టుకోడానికి చాలినంత అధికారం, స్వతంత్రం ఉన్నాయి మా వాడికి. వాటిని ఉపయోగించుకుని కూతురు

*మిగతా 70వ పేజీలో.....*



...67వ పేజీ తరువాయి

ఇంట్లోంచి వెళ్లిపోయినందుకు తనని తానే ఒక అరగంట తిట్టుకుని, ఇప్పుడేం చేద్దామని భార్యని అడిగాడు, లూ.

ఇద్దరూ ఆలోచించి, ఆలోచించి కూతురు ఫ్రెండ్స్ అందరికీ ఫోన్ చేశారు గానీ ఆమె ఎక్కడా లేదు. ఇప్పుడేం చేద్దామని ఇద్దరూ ఉన్న కాస్త జుట్టూ పీక్కున్నారు. అయితే వాళ్లు ఫోన్ చేసినవన్నీ ఆడనంబర్లు! వాళ్ల పరిస్థితికి జాలిపడి నే నొక మగనంబరు చెప్పాను. తమ ముద్దుల సుపుత్రికి మగఫ్రెండ్స్ ఉంటారన్న ఆలోచనైనా లేనివాళ్లు నావైపు వింతగా చూశారు. వికృతంగా చూశారు.

"మీ దగ్గరున్న నంబర్లన్నీ అయిపోయాయి కదా! ఇంక నేను చెప్పిన నంబరు ప్రయత్నించడంలో తప్పేం లేదు కదా!" అన్నాను.

ఇంక తప్పలేదు వాళ్లకి. నంబర్లు నొక్కారు. హల్లో, హలో మన్నారు. చిక్కింది చిలక ఆచూకీ. కొండంత దిగులు నెత్తిమీద నుంచి తొలగిపోగా, పట్టరాని ఆనందంతో "తిక్కలూ! నా తల్లీ! ఉన్నావా అక్కడ! అక్కడే ఉన్నావా!! బెంగపడకు. నే నొచ్చి నిన్ను ఇంటికి తీసుకొస్తా!" పితృప్రేమ కురిసిపోయాడు.

నా అనుమానం నిజం అయినందుకు నాకు ఆనందం కలిగింది గానీ వాళ్లకి నా మీద అనుమానం కల్గింది! అక్కడ అమ్మాయి ఉంటుందని ఈయన కెలా తెలిసిందబ్బా!

"అదే మరి చరిత్ర అంటే!" అన్నాను.

అర్థం అయ్యేట్టు చెప్పమని బతిమాలాడు బడుద్ధాయి!

"పిల్లలు ఎలా చదువుతున్నారు? ఏం చేస్తున్నారు? ఎలా తయారవుతున్నారు? అనేది పట్టించుకోలేనంత బిజీ మనుషులయిపోయార్రా మీరు! మరి నేనో? పరిశీలన తప్ప ఇంకే పనీ, పాటూ లేనివాడిని. నాకు తెలిసింది మీకు తెలియదు. నాకు కనిపించింది మీకు కనిపించదు!" అన్నాను నవ్వుతూ.

జుట్టు పీక్కున్నాడు. ముక్కు గోక్కున్నాడు. నేను చెప్పింది ఒక్క ముక్కా వాడి తలకెక్కలేదని తెలుస్తూనే ఉంది. గొణుక్కుంటూ కూతుర్ని తెచ్చుకోడానికి వెళ్లాడు.

***

నేను హిస్టరీ బుక్‌ని. చెదలు పట్టని హిస్టరీ బుక్! పుస్తకానికి చెద పట్టిందంటే దాన్నెవరూ చదవడంలేదన్నమాట. కానీ, నా సంగతలా కాదు. మా వాళ్లు అప్పుడప్పుడూ ఈ హిస్టరీ బుక్ తీస్తూంటారు. సలహాలు అడుగుతూ ఉంటారు.

తిక్కా టూ కి లెక్కలు రాకపోతే ఫోన్ చేసి ఫ్రెండ్స్‌ని అడుగుతాడు. నాలుగైదులు ఎంతో తెలియని బడుద్ధాయిలు! వాళ్లేం చెబుతారు లెక్కలు? వచ్చినట్టు నా మనవడు నా వద్దకే వస్తాడు లెక్కలు చెప్పమని! మా అబ్బాయి లూ ఆఫీసు సమస్యలు నాతోనే చర్చిస్తాడు. నాకేం కూరలు కావాలో అడిగి తెలుసుకుని అవి తప్ప మిగిలినవి వండుతుంది కోడలు! కాలేజీ అన్న మాటలకు స్పెల్లింగ్ తెలియనివాడిలా కనిపిస్తాను నేను మనవరాలికి. అందుకే జాలిపడి కాలేజీ అంటే ఏమిటో వివరిస్తూ ఉంటుంది నా పక్కన చేరి. అందువల్ల నేను ఎవరికీ అక్కరలేని చెదలుపట్టిన బుక్‌ని కానేకాను!

మనవరాలిని మా అబ్బాయి ఇంటికి తెచ్చిన తర్వాత రెండు రోజులకు ఇంట్లో ఎవరూ లేనప్పుడు కోడలు కాఫీ తెచ్చి ఇచ్చింది.

ఆ సమయంలో నా కది అదనపు కాఫీ ... అయాచిత వరంలాగ!

నేను ఆశ్చర్యంనుంచి తేరుకోకముందే మరో అద్భుతం జరిగింది. నేను ఈజీ ఛెయిర్‌లో కూర్చుంటే కోడలు కింద కూర్చుంది, నా కాళ్లవద్ద! నా గుండు మీదున్న రెండు వెంట్రుకలూ ఠంగ్ ఠంగ్‌న లేచి నిల్చున్నాయి సగర్వంగా!

"కాఫీ బాగుందా, మామయ్యా? అత్తగారు చేసేటంత బాగుందా?" ఆప్యాయంగా అడిగింది. ఆమె అలా అడిగితే "అంతకంటే చాలా బాగుంది!" అనక ఛస్తానా? అన్నాను మరి, గతం జ్ఞాపకం చేసుకుంటూ.

"ఇంట్లో మీకు సుఖంగా ఉందా మావయ్యా! నా వల్ల ఏ ఇబ్బందీ లేదు కదా!"

"నీ వల్ల ఇబ్బందా!! ఛఛ!..." చెవులు మూసుకుని అన్నాను.

"మీరంటే నాకు అమిత గౌరవం మామయ్యా! నాన్నగారికంటే నేను మిమ్మల్నే ఎక్కువగా ప్రేమిస్తాను. అత్తయ్య మీకు రోజూ మూడుసార్లు కాఫీ ఇచ్చేవారు. నేను నాలుగుసార్లు ఇస్తున్నా!"

"ఔనైను! ఆమె తప్ప గ్లాసులో ఇచ్చేది. నువ్వేమో ఇంచక్కా ఫిఫ్టీ ఎంఎల్ కప్పులో అందంగా ఇస్తున్నావు... ఇదిగో ఈ కప్పు అదనం! ఎంత ప్రేమ తల్లీ నేనంటే నీకు!"

"అవును కదా! మరి మీరు నాకో సాయం చేయాలి, మామయ్యా!" అంది బేలగా.

"చెప్పు, తల్లీ!"

ఎలా చెప్పాలి అని కాబోలు ఆలోచించి, "నాకు భయంగా ఉంది, మామయ్యా!" అంది.


"ఔను తల్లీ, టీవీలో అర్ధరాత్రి దాకా దెయ్యం సీరియల్ చూస్తున్నావు కదా మరి!" జాలి కురిపిస్తూ అన్నాను.

"నాది దెయ్యం భయం కాదు, మామయ్యా! రీతిక భయం!"

కాష్మోరాలాగా రీతిక అనే దెయ్యం ఉందా అని అయోమయంలో పడ్డాను.

"ఆ చోరీగాడి ప్రేమలో మన రీతిక పడినట్టుంది మామయ్యా! అదీ నా భయం!" అంది గంభీరంగా.

"వాడి పేరు చోరీ కాదు తల్లీ... శౌరి!"



సరిదిద్దాను.

"వాడి పేరు ఏది కానీ, నా దృష్టిలో వాడు చోరీయే. మీ మనవరాలి మనస్సు దోచాడు. మన ఆస్తిమీద కన్నేశాడు. వాడు చోరీగాడే! మీరెలాగైనా మన రీతికను వాడి వలలోంచి తప్పించి గట్టున పడేయాలి, మామయ్యా!" కన్నీళ్లతో అభ్యర్థించింది.

గడ్డు సమస్యే. అయినా కుటుంబ హితంకోసం రంగంలోకి దిగక తప్పదు కద!

మా రోజుల్లోనే కాక ఈ రోజుల్లో కూడా యువతకు సినిమా స్టార్ అంటే పిచ్చి. అభిమాన హీరోమీద దోమను వాలనివ్వరు ... ఆ కోణంలో నరుక్కురావాలి!

000 000 000

మోడుబారిన చెట్లు, నీళ్లు రాని ఫౌంటెయిన్, మొక్కలు లేని డొక్కు కుండీలతో అలరారే పార్కులో ఓ మూల కూర్చున్నాం నేను, రీతిక, శౌరి.

ఆ కబురూ ఈ కాకరకాయా చెప్పి సినిమాలవైపు సంభాషణ మళ్లించాను.

ఈమధ్య సూపర్ హిట్ సినిమాలు రెండే. నటశూకర నానాజీ నటించిన 'పోరా, చవట!' ఒకటి; నటభీకర నాపాజీ నటించిన 'పోవే, పిడతా!' రెండోది.

శూకర అభిమాని శౌరి అయితే భీకర అభిమాని రీతిక!

"మా హీరో సినిమా 91 రోజులు ఆడింది తెలుసా?" ఘోషించాడు శౌరి.

"మా హీరో సినిమా పదమూడు వారాలు ఆడింది తెలుసా?" ఉద్ఘాటించింది రీతిక.

"మా సినిమా నాలుగు కోట్ల యాభై లక్షలు వసూలు చేసింది!" గొప్పలుపోయాడు శౌరి.

"మా సినిమా కలెక్షన్ నాలుగొందల యాభై లక్షలు!" అరిచింది రీతిక.

"రెండూ సమానమే!" అని గొణిగాను.

"ఎలా సమానమౌతాయి అని ఇద్దరూ నా మీద విరుచుకుపడ్డారు. పదమూడు వారాలకంటే 91 రోజులు ఎక్కువ. 13 ఎక్కడ? 91 ఎక్కడ? అని శౌరి పిడివాదం. నాలుగు కోట్ల యాభైలక్షల కంటే నాలుగొందల యాభై లక్షలు ఎక్కువని రీతిక పెడవాదం. భీకర శూకర సంవాదం మొదలైంది. మాటా మాటా పెరిగింది.

"ఛీ, నీ చచ్చు ముఖం నాకు చూపించకు!" అని శౌరీ, "ఛీఛీ! నీ పుచ్చుముఖం నాకు చూపించకు!" అని రీతిక చటుక్కున లేచి గిరుక్కున దౌడు తీశారు ఇళ్లకు.

ఇంటికి వెళ్లాక అమ్మ మీద పడి ఏడ్చేసింది రీతిక "ఎంతో తెలివైనవాడని నమ్మి ప్రేమించాను, మమ్మీ! కానీ, కల్తీ లేని ఫూల్ అని ఈ రోజే తెలిసింది. ఫూల్! ఫూలున్నర ఫూల్! పదమూడు వారాలకంటే 91 రోజులే ఎక్కువట!" అని ఆక్రోశించి ఆక్రోశించి శోష వచ్చి పడిపోయింది.

మా కోడలు సిబ్బి ముఖం దిబ్బరొట్టెలా వెలిగిపోయింది. "థాంక్యూ, మామయ్యా! సాధించారు. అమ్మాయిని గట్టున పడేశారు!" అని సంతోషించింది సాధ్వి.

పట్టు దొరికినప్పుడే పాఠం చెప్పేయ్యాలి కదా!

"మీదంతా బటన్ బతుకులు అయిపోయాయి తల్లీ! బటన్ నొక్కితే చాలు బట్టలుతికిపారేస్తుంది మిషన్. బటన్ నొక్కితే చాలు వంట అయిపోతుంది. బటన్ నొక్కితే చాలు వినోదం మీ కళ్లముందే. కష్టపడనక్కరలేదు. ఈ బటన్ మాయాజాలంలో పడి మెదడుని ఉపయోగించడం మానేస్తున్నాం. మెదడు మూలపడడంతో అనుభూతులు ఆవిరైపోతున్నాయి. సెంటిమెంట్స్ చెరిగిపోతున్నాయి. అనుబంధాలు తెగిపోతున్నాయి. మనుగడ మాధుర్యాన్ని కోల్పోతున్నది! ఈ బటన్ మాయాజాలం నుంచి మనిషి బయటపడాలి తల్లీ!" అన్నాను.

లా జుట్టు పీక్కుంది. ముక్కు గోక్కుంది. చెవులు దులుపుకుని టీవీ ముందుకు వెళ్లిపోయింది.

పాఠం అయితే చెప్పాను. కానీ ఎవరి తలకైనా ఎక్కిందా అని! ■



## ఎడారిలో వసంతం

చైత్రమాసపు చైతన్యప్రకృతిని
చరిత్ర పుటలలో నిక్షిప్తం చేసి
ఆ హరితసీమల ఆహ్లాదం నుంచి
కరకుశిలల కాఠిన్యంలోకి పయనించే
ఉన్మత్తపథికులం!
ఎడదలన్నీ ఎడార్లు కాగా
మమతల తరువులు మోడులైన మా జీవితాలకు
యంత్రాలే తారకమంత్రాలు!
జపాన్ హార్డ్‌వేర్‌లో అమెరికన్ సాఫ్ట్‌వేర్ లోడ్ చేసి
కంప్యూటర్ యానిమేషన్‌లో చెట్టుచేమల్ని చిత్రించి,
క్లోనింగ్ సిస్టంలో కోయిలల్ని సృష్టించి,
ఎలక్ట్రానిక్ సింథసైజర్‌లో కృత్రిమరాగాలు పలికిస్తాం
ప్రపంచీకరణ అంటే పరాయీకరణే అని భావించి
ఏ అమెరికా వాడో పేటెంట్ రూపంలో తన్నుకుపోయిన
మన మామిడిపిందెల్నీ, వేపపూవునీ
సిల్వర్ ఫాయిల్ ప్యాక్‌లో దిగుమతి చేసుకుంటాం
నాగరకత నుంచి నైతికతను వేరు చేసి
అభివృద్ధి కోసం ఆరాటపడుతూ
ఇంటిపెరట్లో వాడిపోతున్న పూలతీగెల్ని వెక్కిరించి
ఇంటర్నెట్‌లో పర్యావరణప్రాముఖ్యాన్ని చాటుతాం!
ఖండాంతర దూరం తగ్గించి,
మనిషి మనస్సును ఖండఖండాలుగా చీల్చే
సాంకేతిక విప్లవయజ్ఞానికి
సస్యక్షేత్రాలను సమిధలుగా చేసి
సిలికాన్ లోయల్లో వసంతం కోసం అన్వేషిస్తాం!

బలభద్రపాత్రుని ఉదయశంకర్